తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





### గ్రామాల్లో ప్రబలుతున్న విషజ్వరాలు...

## పట్టించుకోని వైద్యఆరోగ్యశాఖ అధికారులు



నాయుడుపేట డిసంబరు 9 ప్రభాతవార్త : నాయుడుపేట మండలంలోని అన్నమేడు, కాలవగట్టు, మర్లపల్లి, చిలమత్తూరు, కూచివాడ, కాపులూరు, కల్లిపేడు, పండ్లూరు, గొట్టిప్రోలు, పూడేరు, మేనకూరు తదితర గ్రామాల్లో ప్రజలు విషజ్వరాలు ప్రబలి అవస్థలు పడుతున్న వైద్యఆరోగ్యశాఖ అధికారులు పట్టించుకోక పోవడంతో నాయుడుపేటలోని ప్రవేటు ఆసుపత్రుల చుటు పరుగులు తీస్తున్నారు. అసలే వర్షాకాలం కావడంతో గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించడం, వైద్యఆరోగ్యశాఖ అధికారులు గ్రామాల్లో పర్యటించి గ్రామీణ ప్రజలకు సీజనల్ వ్యాధులు, ఆరోగ్యంపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పిం చాల్సి ఉండగా వైద్యాధికారులు అటువైపు కన్నెత్తి సూచిన దఖలాలు కనిపిం చడంలేదని గ్రామీణ ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో ప్రజలకు జ్వరం, తలనొప్పి, జలుబు, వాంతులు, విరేచనాలు, కాళ్ళనొప్పులతో ప్రభుత్వ వైద్యశాలకు వెళ్ళితే అక్కడ పనిచేసే సిబ్బంది సక్రమంగా పట్టించు కోకపోగా వారు ఇచ్చిన మందులకు జ్వరాలు తగ్గడంలేదని వాపోతున్నారు. ప్రవేటు వైద్యశాలలకు వెళ్ళగా అక్కడ రక్తపరీక్షల పేరుతో వేలకు వేలు వసూళ్ళు చేస్తున్నారే గానీ, జ్వరాలు తగ్గడంలేదన్నారు. ఇంతజరుగుతున్న వైద్యశాఖ అధికారులు పట్టిచుకోవడంలేదని గ్రామీణ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో మెడికల్ క్యాంప్‌లు ఏర్పాటుచేసి విషజ్వరాలని నియంత్రించాలని ఆయాగ్రామాలు ప్రజలు కోరుతున్నారు.

## ఒంటరి ఏనుగు దాడిలో ఇల్లు ధ్వంసం



ఏనుగు దాడిలో ధ్వంసమైన ఇల్లు

గంగవరం, డిసెంబర్ 9 ప్రభాతవార్త: గంగవరం మండలంలో ఓ ఒంటరి ఏనుగు దాడిలో ఓ ఇల్లు ధ్వంసమైన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. బాధితుడి కథనం మేరకు... గంగవరం మండలం బండమీద జరవారిపల్లె గ్రామానికి చెందిన రెడ్డెప్ప అటవీ సమీపంలోని ఆతని పొలం వద్ద ఇల్లు నిర్మించుకుని 30 సంవత్సరాలుగా జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం ఓ ఒంటరి ఏనుగు ఇంటిపై ఒక్కసారిగా దాడి చేసి ఇంటి పైకప్పు గోడలను ధ్వంసం చేసి ఇంటిలో నిల్వవుంచిన రాగులు, బియ్యం తినడం జరిగింది. ఈ దాడి నుండి రెడ్డెప్ప ఆయన భార్య పిల్లలు స్వలప్పగాయాలతో బయటపడడం జరిగింది. దీనిపై అటవీశాఖ అధికారులకు సమాచారం అందడంతో సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేశారు.

## అర్జీదారుల సమస్యలకు సకాలంలో పరిష్కారం చూపాలి

**-అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్**

తిరుపతి కార్పొరేషన్, డిసెంబర్ 9 ప్రభాతవార్త : ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలను అత్యంత ప్రాధాన్యతతో సకాలంలో అర్థవంతగా పరిష్కారం చూపాలని రీ ఓపెన్ కు తావు లేకుండా అర్జీదారుని సంతృప్తి మేరకు పరిష్కారం చూపాలని కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ నందు ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా జాయింట్ కలెక్టర్ అర్జీదారులకు గౌరవప్రదంగా కుర్చీ ఏర్పాటుతో, వచ్చిన అర్జీదారులకు త్రాగునీటి సౌకర్యం కల్పించి వారి సమస్యలను సావధానంగా వింటూ అర్జీలు స్వీకరించారు. జిల్లాలోని డివిజన్, మండల స్థాయి వరకు ఆర్డీవోలు తాసిల్దారులు, ఎంపిడిఓలు అధికారులు అందరూ పీ జి ఆర్ ఎస్ అర్జీలను నిర్దేశిత గడువులోపు పరిష్కరిం చాలని, పెండింగ్ అర్జీలను త్వరితగతిన అర్థవంతంగా పరిష్కరించాలని ఆదేశించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులను స్వీకరించి, స్పందన ఆన్లైన్ నమోదుతో సిబ్బంది రసీదులు అందించారు. మొత్తం 183 వినతులు రావడం జరిగిందని సంబంధిత అధికారులు అందరు సదరు అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి వేగవంతంగా పరిష్కరించాలని స్పందనకు హాజరయిన వివిధ శాఖలకు సంబందించిన జిల్లా అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

### ప్రభుత్వ లెక్కల నుండి...

# ఓ క్వారీ గల్లంతు!

**- స్వయంగా బాధితులు ఫిర్యాదు చేసిన పట్టించుకోని అధికారులు**
**- 600 గ్రానైట్ దిమ్మెలు తరలించిన అక్రమార్కులు**
**- ఇప్పటికైనా అధికారులు స్పందిస్తారా!**
**-నాటి వార్త - నేటి నిజం**




దుర్గరాజపురంలో ప్రస్తుతం జరుగుతున్న అక్రమ మైనింగ్

చిత్తూరు, శ్రీరంగరాజపురం, డిసెంబర్ 9 ప్రభాతవార్త: నాటి వార్త నేడు నిజమైంది. శ్రీరంగరాజపురం మండలం దుర్గరాజపురం పద్మాపరం ప్రాంతం లోని ఓ క్వారీని అక్రమార్కులు పక్కా ప్రణాళికతో అక్కడి క్వారీని భూగర్భ గనుల శాఖ జాబితా నుండి తొలగించారు. ఆపై భూగర్భ గనులశాఖకు ఎలాంటి రాయల్టీ చెల్లించకుండా అక్కడి నుండి క్వారీలో తవ్వకాలు చేపట్టి యథేచ్ఛగా గ్రానైట్ రాళ్ళను తరలించారు. అప్పుడే ఎస్ఆర్‌పురం పోలీసులు ఎలాంటి అనుమతులు లేకుండా గ్రానైట్ రాళ్ళతో వెళ్తున్న ఓ లారీని సీజ్ చేసినా అక్రమార్కులు రంగంలోకి దిగి సర్దుబాటు చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. అప్పటికే జిల్లా స్థాయి అధికారులతో సర్దుబాటు చేసుకున్న అక్రమార్కులు ఈ ఘటనతో మండల స్థాయి అధికారులను సైతం సర్దుబాటు చేసుకుని క్వారీ నుండి అక్రమంగా గ్రానైట్ రాళ్ళను అక్కడి నుండి తరలించడానికి పూనుకున్నారు. ఈ క్వారీ తమ పేరిట వుందని అయితే తమ క్వారీ నుండి అక్రమంగా గ్రానైట్‌ను తరలించి తమకు భారీ నష్టం కలిగించారని ఆరోపిస్తూ బాధితులు సోమవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి తమ ఆవేదనను వెళ్ళబుచ్చారు. ఈ విషయంపై గత వారంలోనే తాము కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశామని, మళ్ళీ ఈ వారం వచ్చి కలెక్టర్‌ను కలిసినా ఫలితం లేకపోవడంతో పత్రికలకు ఎక్కాల్సి వచ్చిందని వారు ఆరోపించారు. ఇప్పటికే తమ క్వారీ నుండి 600 గ్రానైట్ దిమ్మెలకు పైగా అక్రమంగా తరలించి అక్రమార్కులు 7నుండి 8కోట్ల రూపాయల వరకు ఆర్జించారని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం ప్రభుత్వ ఆదేశాల మేరకు భూగర్భ గనులశాఖ జిల్లాలో వున్న క్వారీల విషయంపై సర్వే నిర్వహించింది. ఈ సర్వే సమయంలో పక్కాగా స్కెచ్ వేసిన అక్రమార్కులు శ్రీరంగరాజపురం దుర్గరాజపురం పద్మాపురం పరిధిలోని ఓ క్వారీని భూగర్భ గనులశాఖ జాబితా నుండి తొలగించారు. భూగర్భ గనుల శాఖకు ఎలాంటి రాయల్టీ చెల్లించకుండా అక్రమంగా క్వారీ తవ్వకాలు చేపట్టి అక్కడి నుండి గ్రానైట్ రాళ్ళను తరలించడం ప్రారంభించారు. ఈ విషయంను సెప్టెంబర్ 22వ తేదీన 'ప్రభాతవార్త' ప్రచురించింది. ఆపై రెండు సార్లు 'ప్రభాతవార్త'తో కథనాలు ప్రచురితమైనప్పటికీ ఇటు భూగర్భ గనుల శాఖ అధికారులు, అటు రెవెన్యూ అధికారులు ఈ విషయంను సీరియస్‌గా తీసుకోలేదు. ఆపై ఎస్ఆర్ పురం పోలీసులు ఈ క్వారీ నుండి తరలివెళ్తున్న గ్రానైట్ రాళ్ళ లారీని పట్టుకున్నారు. అయితే అక్రమార్కులు పోలీసులతో సర్దుబాటు చేసుకోవడంతో ఈ లారీని వదలిపెట్టడం జరిగిందని సమాచారం. అక్కడి నుండి అక్రమా ర్కులు నేరుగా క్వారీ నుండి గ్రానైట్ రాళ్ళను తరలించడం ప్రారంభించారు. ఈ క్వారీ నుండి గత నాలుగు నెలలుగా అక్రమంగా గ్రానైట్ రాళ్ళు తరలివెళ్తున్న ప్పటికీ ఇటు భూగర్భ గనుల శాఖ అధికారులు, అటు రెవెన్యూ, పోలీసు అధికారులు పట్టించుకోకపోవడంతో సోమవారం బాధిత క్వారీ యాజమానులు పత్రికలకు ఎక్కినట్లు సమాచారం.

**ప్రాణానికి ముప్పు:**

చిత్తూరుకు చెందిన ఓ క్వారీ సంఘ నాయకుడి నుండి తనకు ప్రాణహాని వుందని భానుప్రతాప్ ఆరోపించారు. ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్ఆర్ పురం దుర్గరాజుపుం ప్రాంతంలో తనకు 1.98 హెక్టార్ల విస్తీర్ణంలో క్వారీ మంజూరైందని, భూగర్భ గనుల శాఖ కార్యాలయంలో తన క్వారీకి సంబంధించి పనులు చేయడానికి ఓ క్వారీ సంఘ నాయకుడికి జిపిఎను ఇచ్చారని, ఆ జిపిఎను ఫోర్జరీ చేసి అక్రమ మైనింగ్‌కు పాల్పడ్డారని ఆరోపించాడు. క్వారీ నుండి ఎలాంటి అనుమతులు లేకుండా వెయ్యి బ్లాక్‌ల రాయిని మైనింగ్ చేసి ఎక్స్‌పోర్ట్ చేయడం జరిగిందన్నారు. అలాగే తన క్వారీకి ప్రక్కన వున్న మరో క్వారీలో అనుమతి లేకుండా 70 సెంట్లలో మైనింగ్ చేశారని ఆరోపించారు. రెండు వారాల క్రితం తన క్వారీలో పనులు చేపట్టడానికి వెళితే తనను ఆ క్వారీ సంఘ నాయకుడి అనుచరులు అడ్డుకున్నారని, ఈ విషయంపై తాను కలెక్టర్‌కు వెళ్ళి ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందన్నారు. తాను సైతం అధికార తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకుడినేనని, అయితే పార్టీ నాయకులు తనకు న్యాయం చేయడం లేదని ఆరోపించారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి తన క్వారీలో వున్న వాహనాలను అక్కడి నుండి తరలించి తనకు క్వారీ అప్పగించాలని కోరారు.

**అక్రమ మైనింగ్‌కు పాల్పడలేదు : శేఖర్‌నాయుడు**

శ్రీరంగరాజపురం మండలం దుర్గరాజపురం క్వారీ వ్యవహారంలో తనపై వస్తున్న ఆరోపణలు నిరాధారమని గ్రానైట్ వ్యాపారి శేఖర్‌బాబు స్పష్టం చేశారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ క్వారీ మణినాయుడు పేరిట వుందని, ఆయన మృతి చెందిన అనంతరం ఆయన కుటుంబసభ్యులు తనకు విక్రయిస్తున్నట్లుగా జిపిఎ ఇవ్వడం జరిగిందన్నారు. చట్ట ప్రకారం జిపిఎ ద్వారా మైనింగ్ చేయడానికి తనకు అనుమతులు ఇచ్చినట్లు తెలిపారు. ఈ విషయంపై తనపై ఆరోపణలు చేయడం తగదని ఆయన పేర్కొన్నారు.

## తుఫాను మరమ్మతులకు రూ.2.9కోట్లు మంజూరు



తొండమనాడు చెరువు దృశ్యం

శ్రీకాళహస్తి, డిసెంబర్ 9 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి నీటిపారుదల సబ్‌డివిజన్ పరిధిలో ఫెంగల్ తుఫాను మరమ్మతులకు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరన్ సోమవారం రూ. 2.9కోట్లు నిధులు మంజూరు చేసినట్లు ఎస్ఇ మదనగోపాల్ తెలిపారు. తుఫానుకు 148మైనర్, 8 మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల పరిధిలో చెరువులు దెబ్బతిన్నాయి. ఈ చెరువుల మరమ్మతులకు వెంటనే రింగ్‌బండ్‌ను ఏర్పాటు చేసి నీటిని కాపాడినట్లు ఎస్ఇ వివరించారు. తిరుపతి జిల్లాలోని తూర్పు మండలాలు వ్యవసాయప్రధాన ప్రాంతాలు. ఇక్కడ సుమారు 32వేల హెక్టార్లలో వ్యవసాయం సాగిస్తున్నారు. వరి, వేరుశెనగ పంటలను పండిస్తున్నారు. ఈ ప్రాంతంలో భారీ సాగునీటి ప్రాజెక్టులేవు. కానీ నాడు రాజులు నిర్మించిన చెరువుల మీద, వర్షాధారంపై ఆధారపడి వ్యవసాయం సాగుతుంది.

ఈ నేపధ్యంలో ప్రస్తుత శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి సాగునీటి ప్రాజెక్టులపై దృష్టి సారించారు. ముఖ్యంగా స్వర్ణముఖి, కాళంగి మధ్యతరహా ప్రాజెక్టులపై దృష్టి సారించారు. ముఖ్యంగా తొట్టంబేడు మండలాన్ని సస్యశ్యామలం చేసే వాలగలమంద ప్రాజెక్టు ఆనకట్ట వద్ద లాగుల మరమ్మతులు, పది చెరువులకు లింక్‌గా ఉన్న శ్రీకాళహస్తి మండలంలోని తొండమనాడు చెరువు మరమ్మతులకు నిధులు మంజూరు చేసారు. అయితే వాలగలమందలో పుష్కలంగా నీరుంది, కానీ ముందుకు సాగటానికి మధ్యలో రాయి ఉండటంతో తొలగించాల్సి ఉంది. ప్రస్తుతం దెబ్బతిన్న 156 చెరువుల మరమ్మతు లకు రూ. 2.9 కోట్లు మంజూరు అయ్యాయి. ఇందులో ఇప్పటికే పనులు చేపట్టినట్లు ఇఇ మదనగోపాల్ వివరించారు. శాశ్వత మరమ్మతులకు సుమారు రూ. 90 కోట్లు కావాలని అంచనా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఇక శ్రీకాళహస్తి మండలంలోని పది చెరువులకు లింక్ చెరువుగా ఉన్న తొండమనాడు చెరువు మరమ్మతులకు ప్రభుత్వం రూ. 3.5కోట్లు మంజూరు చేయగా పనులు చేపట్టామని ఇరిగేషన్ అధికారులు వివరించారు. ప్రాజెక్టుల్లో నీరు ఉండటంతో పనులు చేపట్టలేదు.

## అభివృద్ధి పనులుకు ప్రణాళికలు సిద్ధం చేయాలి

**- కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ - ప్రజా సమస్యలు ఎందుకు పరిష్కారం కాలేదో కారణం ఉండాలి !**



ప్రజలనుంచి వినతులు స్వీకరిస్తున్న కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్

కుప్పం, డిసెంబర్ 9 ప్రభాతవార్త : కుప్పం నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. సోమవారం స్థానిక మండల కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమంను ఆయన నిర్వహించారు. ప్రజలు వివిధ సమస్యలపై 36 వినతిపత్రాలు అందించగా ప్రాజెక్ట్ డైరెక్టర్ స్వీకరించి ఆయా శాఖల అధికారులకు అప్పగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెలలోనే కుప్పంలో సిఎం చంద్రబాబునాయుడు పర్యటన ఉంటుందని పేర్కొన్నారు. కుప్పంలో ప్రజా సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై సిఎం తప్పక సమీక్ష జరుపుతారన్నారు. గ్రీవెన్స్ సెల్‌కు అందే వినతులపై స్వయంగా ముఖ్యమంత్రితో పాటు సిఎంఒ అధికారుల పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఇక ఇదివరకే నియోజకవర్గంలో చేపడుతున్న రోడ్ల నిర్మాణాలు, గోకులం షెడ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. త్వరలోనే మరిన్ని నిధులు కడకు మంజూరవుతాయని తద్వారా అంగన్‌వాడీ కేంద్రాలు, ఇతర అభివృద్ధి పనులు ప్రారంభించడం జరుగుతుందన్నారు. సమావేశంలో డిఇలు గురవారెడ్డి, సుబ్రమణ్యం, ఎఫ్ఆర్వో జయశంకర్, రెస్కో ఎడిలు ప్రభాకర్, హిమ్మత్‌సాగర్, ఎంఇఒ మహబూబ్ బాషా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వేటగాడి ఇంటిలో పేలిన నాటుబాంబు..!

**- వేట కుక్క మృతి**



గంగవరం, డిసెంబర్ 9 ప్రభాతవార్త: వేటగాడి ఇంటిలో పేలిన నాటుబాంబుకు వేట కుక్క బలైన సంఘటన మండలంలోని గంద్రాజు పల్లె గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు... మండలంలోని గంద్రాజుపల్లెకు చెందిన శంకరప్ప ఇంటిలో నాటుబాంబులు తయారు చేసి సమీపంలోని మామడుగు, పత్తికొండ అటవీ ప్రాంతాలలో వన్యమృగాలను వేటాడి వేట మాంసాలను విక్రయించి జీవనం సాగిస్తునాడని తెలిపారు. ఈ నేపథ్యంలో వన్యమృగాలను వేటాడడానికి తయారు చేసుకున్న నాటు బాంబులను తానునివాసం ఉంటున్న ఇంటి మిద్దెపై నిల్వ ఉంచగా ఆ నాటుబాంబులను తాను పెంచుకున్న వేట కుక్క కొరకడంతో ఈ ప్రమాదం సంబవించిందని ఈ ప్రమాదంలో వేటకుక్క అక్కడిక్కడే మృతి చెందడం జరిగిందని తెలిపారు. ఈ నాటుబాంబు పేలుడుతో గ్రామస్తులు ఒక్కసారిగా ఇలిక్కిపడ్డారు. విషయం తెలుసుకున్న గంగవరం అర్బన్ సిఐ ప్రసాద్ సంఘటన స్థలాన్ని పరిశీలించి నిందితునుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### మెడికల్ షాపులలో... యథేచ్ఛగా వైద్యం!

**-ఉనికిని కోల్పోతున్న అర్హులైన వైద్యులు**

పాకాల, డిసెంబర్ 9 ప్రభాతవార్త : మండల పరిధిలోని కొన్ని మెడికల్ షాపులలో కనీస అర్హత లేనివారు వైద్యం చేస్తున్నా జిల్లా వైద్య ఉన్నతధి కారులు చోద్యం చూస్తూన్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్న వారే వీరికి టార్గెట్ కావడంతో చిన్నపాటి రోగానికి డబల్ డోస్ ఇంజక్షన్స్ వేస్తూ వారిని ధీర్ఘకాలిక రోగాలకు గురిచేస్తున్నారు. అయితే ప్రజల ఆరోగ్యానికి ఇంతటి ప్రమాదం ఏర్పడితున్నా జిల్లా వైద్యాధికారులు పట్టించుకోకపోవడం లేదు. మెడికల్ షాపు లైసెన్స్ ఒకరిదైతే షాపు నడిపించే వారు వేరే. ఇందుకు మద్దతుగా మామూళ్ళ మత్తులో అధికారులను జో కొడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. వైద్యశాఖ అధికారులు చూసి చూడనట్టు వ్యవహారిస్తున్నారని విమర్శిస్తున్నారు. దీంతో అర్హులైన వైద్యులు తమ ఉనికిని కోల్పోతున్నారు. ఇదిలా వుండగా భూతవైద్యం, మూలికా వైద్యం, చివరికి నాటు వైద్యం చేసే వారు సైతం యథేచ్ఛగా డాక్టర్ అని పెద్ద పెద్ద బోర్డులు పెట్టేసి వారానికి ఒక్కరి నుంచి ఒక్కసారికి ఐదు వందల ఒక వెయ్యి రూపాయల వరకు దోచుకుంటున్నారు. పక్షవాత రోగం నయం కావాలంటే ఆరు నెలల కాల పరిమితి విధించి ఒక్కో రోగి నుంచి సుమారు యాభై వెల నుంచి లక్ష రూపాయలు వసూలు చేస్తున్నారు. ఇప్పటికైనా నకిలీ వైద్యులను గుర్తించి కట్టడి చేసి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజలు ప్రాణాలు కోల్పోక ముందే అధికారులు చర్యలు తీసుకుంటారని ఆశిద్దాం.

## ఎన్‌బిపిపిఎల్ భూములు అప్పగించండి

**అది మా పరిధిలో లేదు : జిల్లా కలెక్టర్**



అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వరన్

శ్రీకాళహస్తిరూరల్, డిసెంబర్ 9 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి మండలం లో కొత్త పరిశ్రమల స్థాపనకు ఎన్‌బిపిపిఎల్ వినియోగించని భూములను అప్పగించాలని తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరన్ ఆ సంస్థ ప్రతినిధులతో వర్చువల్ విధానంలో చర్చించారు. సోమవారం కలెక్టర్ ఎన్‌బిపిపిఎల్ ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్,. వెంకటేశ్వరన్ వర్చువల్ విధానంలో చర్చించారు. శ్రీకాళహస్తి మండలం మన్నవరంలో కేంద్ర ప్రభుత్వం ఎన్‌బిపిపిఎల్ సంయుక్తంగా రూ.600కోట్ల పెట్టుబడులతో విద్యుత్ ఉత్పాదక పరికరాల తయారీ పరిశ్రమను ఏర్పాటుకు ప్రతిపాదించగా ప్రభుత్వం 2009లో సుమారు 9 ఎకరాల భూమిని ఎకరా ఒక్కరూపాయితో కేటాయించారు. ఈ భూములను అప్పటిలో ఎన్‌బిపిపిఎల్ సంస్థకు రిజిస్టరనచేయించారు. ఇక్కడ పరిశ్రమలు స్థాపించలేదు, కొంత కాలంగా ఇక్కడ పరిశ్రమ స్థాపన జరగలేదు కాబట్టి ఆ భూములపై ప్రభుత్వం దృష్టి సారించింది. సుమారు 600 ఎకరాల భూములు నిరుపయోగంగా ఉన్నాయని, సోమవారం విజయవాడ నుంచి వర్చువల్ విధానంలో పరిశ్రమలశాఖ కార్యదర్శి యువరాజ్, ఏపిఐఐసి అభిషేక్ట్ కిషోర్, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వరన్‌లు ఎన్‌బిపిపి ఎల్ ప్రతినిధులతో చర్చించారు. గతంలో కూడా కలెక్టర్ తాను ఆ స్థలాన్ని పరిశీలించామని అక్కడ సుమారు 600 ఎకరాల భూమి నిరుపయోగంగా ఉందని, నాడు ఇక్కడ పరిశ్రమ స్థాపన సందర్భంగా 6వేల మందికి ఉద్యోగవకాశాలు వస్తాయని ప్రకటించారని కానీ పరిశ్రమలు స్తాపన లేదని, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లేదని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం పరిశ్రమల స్థాపన ద్వారా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఉందన్నారు. సదరు కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ ఈ భూములు, పరిశ్రమల వ్యవహారం తమ పరిధిలో లేదని అది కేంద్ర విద్యుత్ మంత్రిత్వశాఖ పరిధిలో ఉందని వివరణ ఇచ్చారు. అయితే పరిశ్రమల శాఖ కార్యదర్శి, ఏపిఐఐసి ఎండి మాట్లాడుతూ స్థలం స్వాధీనానికి కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖకు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని ఆదేశించారు.

## గ్రీవెన్స్ అర్జీలను సత్వరమే పరిష్కరించాలి : జిల్లా కలెక్టర్

తిరుపతి కార్పొరేషన్, డిసెంబర్ 9 ప్రభాతవార్త: ప్రజల నుండి అందే పీజీఆర్ఎస్, సిఎంఒ, రెవెన్యూ సదస్సులు, ఆన్లైన్ తదితర విధానాల్లో వచ్చే గ్రీవెన్స్ అర్జీలను సత్వరమే పరిష్కారం చూపాలని, గ్రీవెన్స్ రీ ఓపెన్ కి తావు లేకుండా నాణ్యతగా పరిష్కరించాలని అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ ఆదేశించారు.



సోమవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు పిజిఆర్ఎస్ గ్రీవెన్స్ పై జిల్లా కలెక్టర్ జెసి శుభం బన్సల్‌తో కలిసి జిల్లా అధికారులతో ప్రత్యక్షంగా, డివిజన్, మండల అధికారులతో వర్చువల్ విధానంలో కేసు వారీగా పలు ఫిర్యాదులు సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు, జిల్లా గ్రామ వార్డు సచివాలయ అధికారి నారాయణ రెడ్డి, జిల్లా అధికారులు, డివిజన్, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## క్షేత్ర స్థాయిలో పరిశీలించి సత్వరం సమస్యలు పరిష్కారం

**- అధికారులకు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం**



చిత్తూరు, డిసెంబర్ 9 ప్రభాతవార్త: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి అందిన సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని నూతన సమావేశ భవనంలో సోమవారం కలెక్టర్ సుమిత్ కుమార్ జాయింట్ కలెక్టర్ విద్యాధరి, డిఆర్ఓ మోహన్ కుమార్‌లతో కలిసి ప్రజల నుండి సమస్యలపై అర్జీలను స్వీకరించారు. కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ నిర్వహి ంచిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజలు సమస్యలు 241 అర్జీలు అందజేశారు. ఈ సమస్యలను పరిశీలించి సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, చిత్తూరు అర్డీఓ శ్రీనివాసులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ నీలకంఠేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ట



**శాంతిపురం, డిసెంబర్ 9 ప్రభాతవార్త :** మండలంలోని బొమ్మనపల్లి గ్రామ సమీపంలో సోమవారం నూతనంగా శ్రీ నీలకంఠేశ్వరస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. స్వామివారికి ప్రత్యేక పూజలను పూజారి శ్యాంశాస్త్రి అధ్వర్యంలో జరిపారు. కార్యక్రమానికి హాజరైన భక్తులు విశేష పూజలు నిర్వహించారు.

## ఆధార్ ప్రత్యేక శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి



**కుప్పం, డిసెంబర్ 9 ప్రభాతవార్త :** సిఎం సొంత నియోజకవర్గం కుప్పంలో ఆధార్ కార్డులు, మార్పు లు, చేర్పుల కోసం ఈనెల 19వతేది వరకు ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ తెలిపారు. ఇటీవలి కాలంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలనుంచి ఆధార్ కార్డుల్లో మార్పులు, చేర్పులు, ఆధార్ అప్‌డేట్, బయోమెట్రిక్ తదితర సమస్యలతో పాటు అపార్ కార్డుల మంజూరుకై కుప్పంలో ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లు నిర్వహించాలని కోరారన్నారు. ఈ నేపథ్యంలో కుప్పంలో ప్రజలు, విద్యార్థుల సౌకర్యార్థం ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహణకు చర్యలు చేపట్టామన్నారు. ప్రజలు, విద్యార్థులు ఈ అవకాశాన్ని ఏర్పాటుచేసుకోవాలని సూచించారు.

## గర్భిణీల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ



**పాలసముద్రం, డిసెంబర్ 9 ప్రభాతవార్త:** గర్భిణీ స్త్రీలు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని పాలసముద్రం పిహెచ్‌సి డాక్టర్ ప్రవీణ్ పేర్కొన్నారు. పిహెచ్‌సిలో సోమవారం గర్భిణీ స్త్రీలకు డాక్టర్ ప్రవీణ్ గర్భిణీ స్త్రీలకు బిపి, షుగర్, థైరాయిడ్ తదితర పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు పలు రకాల వైరస్‌లను దృష్టిలో వుంచుకుని ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా వుండాలన్నారు. గర్భిణీ స్త్రీలు సరైన ఆరోగ్య నియమాలు పాటిస్తే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా వుంటారన్నారు. ఈ పరీక్షలకు మొత్తం 30 మంది గర్భిణీలు హాజరు కాగా అందులు నలుగురు గర్భిణీలు హైరిస్క్ వాళ్ళు వున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యునిటీ హెల్త్ ఆఫీసర్ జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్ మురళీ, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ఎంఎల్‌హెచ్‌పిలు పాల్గొన్నారు.

## సత్వరం సమస్యలు పరిష్కారం : కమీషనర్



**చిత్తూరు, డిసెంబర్ 9 ప్రభాతవార్త:** ప్రజా సమస్యలను పరిష్కరించడానికి మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించి ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజల నుండి అందినసమస్యలనుసత్వరంక్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించి పరిష్కరించాలని మున్సిపల్ కమీషనర్ నరసింహ ప్రసాద్ అధికారులనుఆదేశించారు. ఈఅసిస్టెంట్‌కమీషన్‌ర్‌ప్రసాద్, ఎంహెచ్‌ఓ డాక్టర్ లోకేష్, ఎంఇ వెంకటరామిరెడ్డి, ఎసిపి రాజేంద్ర, ఇతర అధికారు లు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ఆదేశాలతో కాలువ, రోడ్డును పరిశీలించిన కమీషనర్

**చిత్తూరు, డిసెంబర్ 9 ప్రభాతవార్త:** ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు ఆదేశాల మేరకు మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ సోమవారం 5వ డివిజన్ పరిధిలోని పోలీసు కాలనీ వద్ద కాలువ, రోడ్డును పరిశీలించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు సోమవారం కమీషనర్ ఆ ప్రాంతంలో వెళ్ళి కాలువ, రోడ్డును పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని అక్కడి ప్రజలకు హామీ ఇచ్చారు. అనంతరం కమీషనర్ కట్టమంచి బైపాస్ రోడ్డును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఇ వెంకటరామిరెడ్డి, కార్పొరేటర్ హరిణిరెడ్డి, ఎఇ లోకేష్, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన కాణిపాకం ఇఓ



**చిత్తూరు, డిసెంబర్ 9 ప్రభాతవార్త:** కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను సోమవారం ఆయన ఛాంబర్‌లో కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయ ఇఓ పెంచల కిషోర్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఆయన జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అలాగే ఇఓ పెంచల కిషోర్ ట్రైనీ కలెక్టర్ హిమవంశీని కలిసి శాలువతో సన్మానించి కాణిపాకం ఆలయ ప్రసాదాలను అందజేశారు.

## ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు



***శ్రీకాళహస్తి, డిసెంబర్ 9 ప్రభాతవార్త :*** కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ 78వ పుట్టినరోజును పురస్కరించుకుని పట్టణంలోని నియోజకవర్గ ఇన్‌ఛార్జి కాంగ్రెస్‌పార్టీ ఇన్‌ఛార్జి డాక్టర్ ఎస్.బత్తెయ్యనాయుడు కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి కేక్‌కట్‌చేసి మిఠాయిలు పంపిణీచేశారు. సోనియా గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రాబోవు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని ప్రచారం మొదలు పెట్టారు. ఈసందర్భంగా డాక్టర్ బత్తెయ్యనాయుడు మాట్లాడుతూ బిజెపి పార్టీ మోడీ ప్రభుత్వం నెహ్రూ కుటుంబాన్ని తప్పుపట్టడమే పనిగా ప్రచారం సాగిస్తున్నారన్నారు. అనంతరం చిన్నారులకు చాక్లెట్లు పంపిణీచేశారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ ఇర్లగోపి, శెట్టిపల్లి శివయ్య, నాగూరయ్య, రమణయ్య, మోహన్ తదితరులు పాల్గొన్నారు

## గంజాయి సాగు...విక్రయాలు చేపడితే కఠిన చర్యలు : డిఎస్పీ



**రామకుప్పం, డిసెంబర్ 9 ప్రభాతవార్త :** మండలంలో ఎవరైనా అక్రమంగా గంజాయిసాగు, విక్రయాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని కుప్పం డిఎస్పీ పార్థసారథి హెచ్చరించారు. సోమవారం రాత్రి అటవీ గ్రామాలైన వీర్నమల, ఆరిమానుపెంట గ్రామాల్లో గంజాయి నిషేధం, సైబర్ నేరాలు, సిసి కెమెరాల ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ సరిహద్దు ప్రాంతాల్లో గంజాయిసాగుపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రూరల్ సిఐ మల్లేష్ యాదవ్, ఎస్సై వెంకటమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికే రెవిన్యూ సదస్సులు

**గుడుపల్లి,డిసెంబరు 9 ప్రభాతవార్త :** మండలంలో నెలకొన్న రెవిన్యూ సమ స్యల పరిష్కారానికే రెవిన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు మండల అధ్యక్షుడు బాబునాయుడు పేర్కొన్నారు. మండలంలోని కుప్పిగానిపల్లిలో జరిగిన రెవిన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రెవిన్యూ సమస్యల పరిష్కా రానికి ప్రతి గ్రామంలో సదస్సులు నిర్వహిస్తున్నారన్నారు. అనంతరం జనసేనా మండల అధ్యక్షుడు అమీర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను తీసుకు రావడం జరిగిందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో నేతలు యస్.ఆర్. చంద్ర, వెంకటేష్, భాను, రామమూర్తి, ప్రజలు అధికారులు పాల్గొన్నారు.

## పంటల బీమాను సద్వినియోగం చేసుకోవాలి

**కల్లూరు, డిసెంబర్ 9, ప్రభాతవార్త:** పులిచెర్ల, రొంపిచర్ల, సదుం, చౌడేపల్లి, సోమల మండలాల్లో మామిడి, టమాటా సాగు చేసే రైతులు పంటల బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉద్యానవన శాఖ అధికారిణి సంతోష కుమారి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మామిడి టమాటా పంటలకు బీమా సౌకర్యాన్ని కల్పించిందని అన్నారు. మామిడి ఒక ఎకరానికి రూ. 1750 ప్రీమియం చెల్లించాలని పంట నష్టపోతే రూ.35 వేలు బీమా చెల్లిస్తారని అన్నారు. టమాటాకు ఎకరానికి రూ. 1250 ప్రీమియం చెల్లించాలని పంట నష్టం కింద రూ. 25000 బీమా చెల్లిస్తారని తెలిపారు. గ్రామ సచివాలయాల్లో ఈ నెల 15 వ తేదీ లోపు దరఖాస్తులు అందజేయాలని ఉద్యానవన శాఖ అధికారిణి సంతోషి కుమారి తెలిపారు.

## షఫీఉల్లా మృతి తీరని లోటు : చల్లా



**కల్లూరు, డిసెంబర్ 9 ప్రభాతవార్త :** టిడిపి నాయకులు షఫీ ఉల్లా మృతి తీరని లోటు అని పుంగనూరు నియోజకవర్గ ఇన్చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. పులిచెర్ల మండలంలోని రెడ్డివారిపల్లి పంచాయతీ గ్రామ కమిటీ అధ్యక్షులు వాటర్ షెడ్ ఛైర్మన్ షఫీఉల్లా ఆకస్మికంగా మృతి చెందారు. పుంగనూరు నియోజకవర్గ ఇన్చార్జి చల్లా రామచంద్రారెడ్డి షఫీఉల్లా పార్థివ దేహానికి తెలుగుదేశం పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు.

## గర్భవతులకు వైద్య పరీక్షలు



**కల్లూరు, డిసెంబర్ 9 ప్రభాతవార్త :** ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎల్లంకివారి పల్లిలో ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంను మెడికల్ ఆఫీసర్‌లు డా.పి.యల్లయ్య, రమ్యశ్రీ ఆధ్వర్యంలో గర్భిణి స్త్రీలకు అన్నీ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో ఉన్న గర్భవతులు అందరికి వైద్యాధికారులు వైద్య పరీక్షలు నిర్వహించి ప్రయోగశాలకు పంపగా రక్తనమూనాల ద్వారా అన్నీ పరీక్షలు నిర్వహించారు.

## మెగా పశువైద్యశిబిరం,పశుపోషణపై అవగాహన



శ్రీకాళహస్తిరూరల్, డిసెంబర్ 9 ప్రభాతవార్త : రాస్ కృషి విజ్ఞానకేంద్రం తిరుపతి మరియు రాస్ మహిళా వాణి ఆధ్వర్యంలో సంయుక్తంగా కెవిబిపురం మండలం కొత్తూరు మరియు కొత్తూరు హరిజనవాడ గ్రామాల్లో మెగా ఉచిత పశువైద్యశిబిరం నిర్వహించి గ్రామంలోని పశువులకు, జీవాలకు చికిత్స అందించి అవసరమైన మందులు పంపిణీచేసినట్లు కేంద్ర సీనియర్ శాస్త్రవేత్త మరియు హెడ్ డాక్టర్ ఎస్.శ్రీనివాసులు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కృషి విజ్ఞానకేంద్రం రైతులు కోసం చేపడుతున్న వివిధ కార్యక్రమాల గురించి, వ్యవసాయంలో పంటల సాగుతో పాటు పశుపోషణ ప్రాముఖ్యత గురించి వివరించారు. అనంతరం డీవార్మింగ్‌లో భాగంగా పశువులకు పురుగుల మందు, పిరుదుల నివారణ మందుస్ప్రే చేయడం జరిగింది. కార్యక్రమంలో పశువైద్యశాస్త్రవేత్త డా.డి.అనూష ప్రస్తుతం పశువుల్లో వచ్చే వివిధ సీజనల్ సమస్యలకు గుర్తింపు లక్షణాలు, నివాణ చర్యలు గురించి వివరించారు. కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్త రామ్‌కుమార్, రాస్ మహిళా వాణి ప్రాజెక్టు అధికారి వెంకటేష్, సిబ్బంది శంకరయ్య, వినోద్, ముఖేష్, స్వరూప, పశువైద్య సహాయకులు గ్రామ సర్పంచ్ సుబ్రమణ్యం మరియు రైతులు, పాదుపు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారంకు చర్యలు తీసుకుంటాం:ఆర్డీఓ



**కుప్ప ం, డిసెంబర్ 9 ప్రభాతవార్త :** కుప్పం డివిజన్ పరిధిలో ఉన్న దళిత, గిరిజనుల సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని కుప్పం ఆర్డీఓ శ్రీనివాసులు రాజు పేర్కొన్నారు. సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో డివిజనల్ స్థాయి ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మరియు మానిటరింగ్ కమిటీ సమా వేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ దళిత, గిరిజనవాడల్లో నెలకొన్న సమస్యల పరిష్కారంకు చర్యలు చేపడ్తామన్నారు. అవసరమైన చోట్ల రోడ్ల సమస్యలు, తాగునీటి, వీధిదీపాలను ఏర్పాటు చేయిస్తామన్నారు. దళిత నేతలు మాట్లాడుతూ దళిత గిరిజనులకు చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. కుప్పంలోని అంబేద్కర్ భవనానికి మరమ్మతులు చేయించి సంపూర్ణంగా వినియోగంలో తేవాలని కోరారు. అలాగే దళితులకు అవసరమైన చోట్ల స్మశాన వాటికలు, దారి సౌకర్యాలు కల్పించాలని ఆర్డీఓను కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. సమావేశంలో ఎంపిడిఓ సాయిలహరి, సోషియల్ వెల్ఫేర్ అధికారి మీనాక్షి, డివిఎంసి సభ్యులు కె.కన్నన్, జగదీష్, కెసి గోవిందరాజులు, అధికారులు పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



కుప్పంరూరల్, డిసెంబర్ 9 ప్రభాతవార్త : గ్రామాల్లో నెలకొన్న భూసమస్యల పరిష్కారానికే గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ చిట్టిబాబు పేర్కొన్నారు. సోమవారం మల్లానూరు, అడవిములకలపల్లి గ్రామా ల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రీసర్వే, ఇతర రెవెన్యూ సంబంధిత సమస్యలపై రైతులు, ప్రజలు వినతులు అందించవచ్చన్నారు. అడవిములకలపల్లిలో ఓంశక్తి ఆలయం నిర్మా ణంకు స్థల సమస్య పరిష్కరించారు. కార్యక్రమాల్లో ఆర్ఐ వేణుగోపాల్, విఆర్వోలు, తెదేపా రాష్ట్ర యు వతకార్యదర్శిచెక్కునత్తం మణి,క్లస్టర్‌ఇన్‌చార్జ్ మహేంద్ర, విఎస్ఎస్ ఛైర్మన్ కనకరాజ్,రైతులు పాల్గొన్నారు.

## ఆధార్ శిబిరాలు కిటకిట



**కుప్పంరూరల్, డిసెంబర్ 9 ప్రభాతవార్త :** ప్రభుత్వం ఆదేశాల మేరకు కుప్పం మండలంలో ప్రత్యేకంగా నిర్వహిస్తున్న ఆధార్ శిబిరాలు కిటకిటలాడు తున్నాయి. సోమవారం మండలంలోని పొన్నాంగూరు, పైపాళ్యం, గోనుగూరు తదితర గ్రామాల్లో జడ్పీ హైస్కూళ్లలో ఆధార్ శిబిరాలను నిర్వహించారు. ఆధార్ కార్డులో నెలకొన్న సమస్యలు, విద్యార్థులకు ప్రభుత్వం అందించే అపార్ కార్డుల మంజూరు దృష్ట్యా కుప్పంలో ప్రత్యేకంగా ఆధార్ శిబిరాలు నిర్వహిస్తు న్నారు. మంగళవారం చందం, దాసేగానూరు హైస్కూళ్లలో ఈకార్యక్రమం జరుగుతుంది. కార్డులకోసం యాభై రూపాయల నగదు చెల్లించాల్సి ఉంది.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## అర్ధాకలితో జీవిస్తున్నాము ఆదుకోండి!



***సోమల, డిసెంబర్ 9 ప్రభాతవార్త :*** అడవిలోకి వెళితేనే మాకు జీవనం సాగేది. రెక్కాడితే గాని డొక్కాడని బ్రతుకులు మావి. అలాంటి మాపై భూస్వాములు కన్నెర్ర చేసి, అడవికి వెళ్లకుండా దారిని మూసివేశారు. తరతరాలుగా అడవిని నమ్ముకుని జీవిస్తున్న మాకు అడవికి వెళ్లే దారి కనపడటం లేదు. మీరే దయతలసి మాకు అడవికి వెళ్లి దారిని చూపించి, మా ఆకలి బాధలు తీర్చాలంటూ తాసిల్దార్ బెన్ను రాజును ఆవులపల్లి పంచాయతీ దేవుల కుప్పం యానాదివాడ ప్రజలు వేడుకొన్నారు. శనివారం ఆవులపల్లిలో రెవెన్యూ సదస్సు నిర్వహించామని అక్కడికి మీరెందుకు రాలేదని తాసిల్దార్ అడగగా భూస్వాములకు భయపడి అక్కడికి రాలేదని వారు తెలిపారు. అటవీ సమీపంలో 20 ఎకరాలు భూములు తాము సాగు చేసుకుంటూ ఉండేవారమని ఆ భూమిని కబ్జా చేసేందుకే దారి మూసివేసారని వారు తహశీల్దార్ తెలిపారు. తహశీల్దార్ స్పందిస్తూ వెంటనే సర్వే చేసి వారికి దారి సౌకర్యం ఏర్పాటు చేయాలని మండల సర్వేయర్‌కు ఆదేశాలు జారీ చేయడంతో వారు వెనుతిరిగి వెళ్లారు.

## పరిష్కార వేదికలుగా రెవిన్యూ సదస్సులు : ఆర్డీఓ



**చౌడేపల్లి, డిసెంబర్ 9 ప్రభాతవార్త :** భూసమస్యల పరిష్కార వేదికలుగా రెవిన్యూ సదస్సులు ఉపయోగ పడతాయని పలమనేరు ఆర్డీఓ భవాని అన్నారు. మండలంలోని పంచాయతీ కేంద్రం దుర్గసముద్రం సచివాలయం వద్ద రెవిన్యూ సదస్సు జరిగింది. సమస్యను బట్టి కాల పరిమితి వుంటుందన్నారు. అదే విధంగా సామాజిక, వ్యక్తిగత సమ స్యలను సైతం సదస్సుల్లో పరిష్కరింపబడతాయన్నారు. మ్యూటేషన్, రీసర్వే, 22ఎ, ఆర్ఓఆర్‌ల్యాండ్ గ్రాబింగ్, ఫ్రీహోల్డ్ అసైన్‌మెంట్ వంటి భూసమస్యలతో 25మంది రైతులు అధికారులకు వినతిపత్రా లందించారు. రెవిన్యూ అధికారులు గ్రామంతోపాటు పొలాలను సందర్శించారు. తహశీల్దార్ హను మంతు, డిటిమాధవి, ఆర్ఐభారతి, మండల సర్వేయర్ గుణశేఖర్, మాజీ సర్పంచు వెంకట్రమణ, రైతులు పాల్గొన్నారు.

## కాశీవిశ్వేశ్వరాలయంలో విశేష పూజలు



**చౌడేపల్లి, డిసెంబర్ 9 ప్రభాతవార్త :** చౌడేపల్లి పరిధిలోని చిన్నకొండామర్రి సమీపంలో గల విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం శివనామస్మరణతో మార్మోగింది. అధిక సంఖ్యలో వచ్చిన భక్తులకు ఆలయ నిర్మాణదాత మనోహర్ పవిత్ర తీర్థ ప్రసాదాలందించాడు.

## మానవ హక్కుల పరిరక్షణపై అవగాహన సదస్సులు




**చిత్తూరురూరల్, డిసెంబరు 9 ప్రభాతవార్త:** మానవ హక్కుల పరిరక్షణ కోసం భారత సమ సమాజ అభివృద్ధి సంస్థ పనిచేస్తుందని, ఆ సంస్థ రాష్ట్ర అధ్య క్షుడు తలారి క్రిష్ణమూర్తి పేర్కొన్నారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 10న ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా అవగాహన సదస్సులను ఏర్పాటు చేసి ప్రభుత్వ అభివృద్ధి పథకాల గురించి ప్రజలకు తెలియజేసేలా చైతన్య కార్యక్రమాలు నిర్వహించి యువతకు ఉపాధి, శిక్షణపై అవగాహన కల్పిస్తామన్నారు. ఈ సమా వేశంలో నాయకులు మునస్వామి, ధనుంజయరావు, బాబు, రాజ్‌కుమార్, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## అదనపు డీఎంఅండ్‌హెచ్‌ఓచే పీహెచ్‌సీ తనిఖీ



**తవణంపల్లె, డిసెంబర్ 9 ప్రభాతవార్త:** జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జి.వెంకట ప్రసాద్ సోమవారం తవణంపల్లె పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఈసందర్భంగా పీహెచ్‌సీలోని సిబ్బంది హాజరు పట్టీని, రికార్డులను పరిశీలించారు. అలాగే పీహెచ్‌సీకి ఎంత మంది రోగులు వస్తున్నారు? వారికి ఏవిధంగా చికిత్సలు అందిస్తున్నారని వాకబు చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి మాతృవందన యోజన కార్యక్రమం అమలు తీరు తెన్నుల గురించి పరిశీలించారు. అనంతరం గర్భిణీ స్త్రీలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈకార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

## వరసిద్ధుని దర్శించుకున్న పలువురు ప్రముఖులు



**కాణిపాకం, డిసెంబర్ 9 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామి వారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఈమేరకు కడప శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి, ప్రకాశం జిల్లా ఎస్పీ దామోదరంలు వేర్వేరుగా సోమవారం కాణిపాకం స్వామివారిని దర్శించు కున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఈఓ పెంచల కిషోర్, ఏఈఓ రవీంద్రబాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. వారి వెంట టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాలాజీనాయుడు, చిట్టిబాబు, చిత్తూరు రూరల్ వెస్ట్ సీఐ శ్రీధర్‌నాయుడు, స్థానిక ఎస్సై ధరణీధర తదితరులు పాల్గొన్నారు.

## గణనాధుని సన్నిధిలో వెంకయ్యనాయుడు కుటుంబసభ్యులు



**కాణిపాకం, డిసెంబర్ 9 ప్రభాతవార్త:** భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు కుటుంబసభ్యులు సోమవారం కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఈమేరకు వెంకయ్యనాయుడు సతీమణి ఉషమ్మ, కుమార్తె దీపా వెంకట్, వారి కుటుంబసభ్యులు కాణిపాకం స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఈఓ పెంచల కిషోర్, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వారి వెంట ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్ వాసు టెంపుల్ ఇన్స్‌పెక్టర్ చిట్టిబాబు, స్థానిక నాయకులు శేషాద్రినాయుడు, మనోహర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## ముస్లిమ్‌లకు కూటమి ప్రభుత్వం అండగా వుంటుంది : ఎమ్మెల్యే



**పుత్తూరు, డిసెంబరు 7 ప్రభాతవార్త :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ముస్లిమ్ లకు అండగా వుంటుందని ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ తెలిపారు. టిడిపి పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గాలి జీవరత్నంనాయుడు, ఎన్.ఎన్. ధనపాల్ నేతృత్వంలో సోమవారం ముస్లిమ్‌లంతా ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన మాట్లాడుతూ బడ్జెట్‌లో మైనార్టీల సంక్షేమానికి రూ. 437 కోట్లను ప్రభుత్వం కేటాయిం చిందని తెలిపారు. మైనార్టీలకు రాష్ట్ర ఆర్థిక కార్యక్రమాల్లోనూ, ఉపాధిలోనూ సమాన అవకాశాలు కల్పిస్తామన్నారు. పట్టణంలోని షాదీ మహల్‌లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని, భవానీనగర్‌లోని శ్మశానానికి ప్రహరీగోడ నిర్మించాలని మైనార్టీ నాయకులు ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ముస్లిమ్ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు ఖాజాపీర్, టిడిపి నాయకులు బాబునాయుడు, కరీమ్, రఫీ, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## వార్తకు స్పందన...గోతులు పూడ్చివేత



**పాకాల, డిసెంబర్ 9 ప్రభాతవార్త :** పాకాల మండలం దామల చెరువు మెయిన్ రోడ్డులో గోతులు పడ్డ రోడ్డు అన్న కథనం పై నవంబర్ 25వ తేదీన వార్త దినపత్రికలో వచ్చిన కథనానికి స్పందించిన అధికారులు సోమవారం ఉదయం రోడ్డుపై ఉన్న భారీ గోతులన్నింటికీ తారుతో ప్యాచ్‌వర్క్ పూర్తి చేసారు. అధికారులు స్పందించిన తీరును చూసిన వాహనదారులు మరియు స్థానికులు హర్షంవ్యక్తంచేస్తున్నారు. అలాగేమొగరాలరోడ్డులోనిరైల్వేస్టేషన్, ప్రాథమికవైద్యశాలముందువున్నభారీగోతులనుకూడాపూడ్చవలసినదిగాఅధికారులను స్థానికులు కోరుతున్నారు.

## బ్రహ్మోత్సవాల విజయవంతంపై అభినందనలు

**తిరుచానూరు, డిసెంబరు9 ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతి సాంప్రదాయాలు ఉట్టిపడేలా తిరుచానూరు బ్రహ్మోత్సవాలు నిర్వహించారని తితిదేను ముఖ్యమంత్రి అభినందించారు. తిరుచానూరు బ్రహ్మోత్సవాలు విజయ వంతంగా ముగిసిన సందర్భంగా ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎక్స్ వేదికగా తితిదే ఛైర్మన్ బిఆర్.నాయుడు మరియు ఈఓ జె.శ్యామలరావును అభినందించారు. ముఖ్యమంత్రి సందేశంలో భాగంగా అమ్మవారి బ్రహ్మోత్సవాల దివ్యమైన వైభవాన్ని వీక్షించడం ఆనందంగా వుంది అని అన్నారు. ముందు చూపుతో ప్రణాళికా బద్ధంగా కార్యక్రమాలు ఏర్పాటు చేసుకుని భక్తులందరికి అమ్మవారి అనుగ్రహం కలిగేలా చర్యలు చేపట్టారని తితిదేను ముఖ్యమంత్రి అభినందించారు.

## మహిళా వర్సిటీ వీసీ జర్మనీ పర్యటన



**తిరుపతి విద్య డిసెంబర్ 9 ప్రభాత వార్త:** పద్మావతి మహిళా వర్సిటీ ఇంచార్జి వీసీ ప్రొఫెసర్ వి.ఉమ జర్మనీ పర్యటనకు బయలుదేరారు. సోమవారం నుంచి ఈనెల 14వ తేదీ వరకు జర్మనీలో "ఉన్నత విద్య,సైన్స్ కోఆపరేషన్ సంస్థల సహకారం" అనే అంశంపై జరగనున్న యాత్రలో ఆమె పాల్గొననున్నారు. ఫెడరల్ రిపబ్లిక్ ఆఫ్ జర్మన్ విజిటర్స్ ప్రోగ్రామ్లో భాగంగా ఆ ప్రాంత ప్రజల సంస్కృతి,సాంప్రదాయాలు,టెక్నాలజీ వినియోగం, ఉన్నత విద్య,ఉపాధి రంగం వంటి అంశాలపై నిశితంగా పరిశీలించనున్నారు. ఆమె మాట్లాడుతూ ఈ పర్యటన సహకార పరిశోధన, విద్యార్థులు,అధ్యాపకుల మార్పిడి, ద్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్లు,సాంస్కృతిక సహకారాలకు సంబంధించి జర్మన్ విద్యాసంస్థలతో భాగస్వామిగా కొనసాగేందుకు సహకరిస్తుందని తెలిపారు.

## పైప్‌లైన్ త్రవ్వన వారిపై చట్టపరమైన చర్యలు

**తిరుపతి విద్య, డిసెంబర్ 9 ప్రభాతవార్త:** సహజ వాయువు పైప్లైన్ ను తవ్వకం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పని ఈజీ అండ్ పి ప్రథమ్ సంస్థ ప్రతినిధులు హెచ్చరించారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ తిరుపతిలోని శ్రీ సాయి నగర్‌లో,ఏజి అండ్ పి ప్రథమ్ సంస్థ ద్వారా వేయబడిన సహజ వాయువు పైప్‌లైన్ ఇటీవల డ్రైనేజీ పైప్‌లైన్‌ను అమర్చడానికి ప్రయత్నిస్తున్న ఇంటి యజమాని చేపట్టిన తవ్వకాల కారణముగా పాడైంది. ప్రస్తుత చట్టాల ప్రకారం,ఐపీసీ సెక్షన్ 285, 336 కింద ఈ తరహా అనధికార నష్టాలకు 3 సంవత్సరాల జైలు శిక్ష,25 కోట్ల వరకు జరిమానా విధించబడుతుందన్నారు. ఈ ప్రాంతంలో గ్యాస్ సరఫరాను వీలైనంత త్వరగా పునరుద్ధరించేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వ చట్టం ప్రకారం, తృతీయ పక్షం తవ్వకం పనులను ప్రారంభించాలనుకుంటే, వారు డయల్ బిఫోర్ యు డిగ్ కాంటాక్ట్ నంబర్,1800 2022 999 ద్వారా సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీకి తెలియజేయాలని సూచించారు.

## ప్రజలకు అండగా నిలవండి



**నగరి, డిసెంబరు 9 ప్రభాతవార్త:** పార్టీ శ్రేణులు ప్రజలకు అండగానిలవాలని వారి సమస్యలను పరిష్కరించడంతో ముందుండాలని మాజీ మంత్రి రోజా అన్నారు. సోమవారం నగరి పట్టణంలోని తన నివాస కార్యాలయం వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాలక ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలపేరుతో ప్రజలను బురిడి కొట్టించిందన్నారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలలు అవుతున్నా పథకాలు ప్రజలకు అందలేదన్నారు. అర్హత ఉన్నా పెన్షన్లు తొలగించేస్తున్నారని, కొత్త పెన్షన్లు మంజూరు చేయడం లేదన్నారు. ఈ అంశాలపై ప్రజలు పక్షాన నిలబడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సమావేశంలో మున్సిపల్‌చైర్మన్ పీజీ నీలమేఘం, జడ్పీటీసీ సభ్యులు గాంధీ, రాష్ట్ర మొదలియార్ సంఘం మాజీ డైరెక్టర్ బాలకృష్ణన్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ తిరుమలరెడ్డి, దేశమ్మ దేవాలయ మాజీ చైర్మన్ వేణుబాబు, కౌన్సిలర్లు బీడీ భాస్కర్, బాబు, మురుగ, భూపాలన్, విజయపురం వైస్ ఎంపీపీ బాలాజీ, వడమాలపేట మాజీ జడ్పీటీసీసభ్యులు సురేష్‌రాజు, మునివేలు తదితరులు పాల్గొన్నారు.

## స్టాఫ్ గేమ్స్‌లో నగరి అధ్యాపకుల ప్రతిభ

**నగరి, డిసెంబరు 9 ప్రభాతవార్త:** శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయంలో ఈ నెల 8న జరిగిన యూనివర్సిటీస్టాఫ్‌గేమ్స్‌లో నగరి డిగ్రీ కళాశాలకు చెందిన అధ్యాపకులు ప్రతిభకనబరచారు. టెన్నిస్ సింగిల్స్ విభాగంలో రాజనీతి శాస్త్ర విభాగం ఇన్‌చార్జి భాస్కర్‌రాజు ప్రతిభ చూపి రన్నర్‌గా నిలువగా, త్రోబాల్, బాల్ బ్యాడ్మింటన్ మహిళా విభాగంలో బోటనీ అధ్యాపకురాలు అరుణకుమారి టీమ్ రన్నర్‌గా నిలిచారని ప్రిన్సిపాల్ వేణుగోపాల్ తెలిపారు. సోమవారం కళాశాలలో అధ్యాపకులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ భాస్కర్‌రాజు, ఎన్‌సీసీ ఆఫీసర్ భాస్కర్, కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎక్సామినేషన్స్ వేణుగోపాల్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతిలో సోనియాగాంధీ జన్మదిన వేడుకలు

**తిరుపతి(రవాణా),డిసెంబర్ 9 ప్రభాతవార్త:**



క్లిష్టసమయంలో కాంగ్రెస్‌పార్టీ పగ్గాలు చేపట్టి దేశంలోని పార్టీ నాయకులు, శ్రేణులను ఐక్యంగా నడిపించి, పార్టీకి దిశదశ నిర్దేశం చేసిన నాయకురాలు సోనియాగాంధీ అని తిరుపతిజిల్లా కాంగ్రెస్ నాయకులు కొనియాడారు. సోనియాగాంధీ జన్మదినాన్ని సోమవారం తిరుపతిజిల్లా కాంగ్రెస్ నాయకులు గౌడపేర చిట్టిబాబు, దొడ్డారెడ్డి రాంభూపాల్‌రెడ్డి, మాంగాటి గోపాల్‌రెడ్డి, వెంకట నరసింహులు, శివశంకర్, జ్యోతీశ్వర్ నాయక్, రామచంద్రయ్య, సుబ్రమణ్యం, రాజు, వపన్, మస్తాన్, భార్గవ్ హరి తదితరులు పాతమున్సిపల్ కార్యాలయం కూడలిలోని రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద కేక్‌కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు.

## తహసీల్దార్ కార్యాలయంలో...

### సమస్యల పరిష్కారం కావడం కష్టమా..!
### -సమస్యలు జిల్లా కలెక్టరేట్‌కు చేరుతున్న అర్జీలు

**గంగవరం,డిసెంబర్ 9 ప్రభాతవార్త:** మండలంలోని సమస్యలు తహసీల్దార్ కార్యాలయంలో పరిష్కారం కావడం కష్టంగా మారుతుందా అన్నట్లుగా గంగవరం మండలం తహసీల్దార్ కార్యాలయంలో పరిస్థితి నెలకొంది. కలెక్టరేట్‌కు ప్రతి సోమవారం మండలం నుండి వెళుతున్న ఫిర్యాదులతో అధికారుల విధులు ఏయాత్రం నిర్వహిస్తున్నారో అర్థమౌతుంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాట నుండి మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న కీలక రెవెన్యూ సమస్యలపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వచ్చే సమస్యలపై ఫిర్యాదు చేసినప్పటికి అక్కడి అధికారులు పట్టించుకోక పోవడంతో సమస్యల పరిష్కారానికై స్థానిక రైతులు,ప్రజలు ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్‌కు చేరుకుని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ దృష్టికి తీసుకువెళుతున్నారు. సోమవారం మండలంలోని కీలపల్లె పంచాయితీ రైతు లు, ప్రజలు గ్రామంలో పూర్వకాలం నుండి వస్తున్న దారి ఆక్రమణ పరిష్కారంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

# 25 కేజీల గంజాయి-5 సెల్‌పోన్లు స్వాధీనం!

నాయుడుపేట, డిసెంబరు 9ప్రభాతవార్త ; నాయుడుపేటలో గంజాయి రవాణాకు పాల్పడుతున్న ముఠాపై ఉక్కుపాదం మోపడం జరుగుతుందని నాయుడుపేట డిఎస్‌పి చెంచుబాబు అన్నారు. నాయు దుపేట సబ్‌డివిజన్ కార్యాలయంలో డిఎస్‌పి చెంచుబాబు ఆధ్వర్యంలో పోలీసులు విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డిఎస్‌పి చెంచుబాబు మాట్లడుతూ నాయుడు పేటలో గంజాయి సరఫరాకు పాల్పడుతున్న ముఠాలో ఆరుమంది స్మగ్లర్లను అదుపులోనికి తీసుకొని, వారివద్ద నుండి మూడు లక్షలు విలువచేసే 25కేజీల గంజాయి, ఐదు సెల్‌పోన్లును స్వాధీనం చేసుకొని అరెస్టుచేసి కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు ఆయన తెలిపారు. గుంటూరు జిల్లాకు చెందిన ప్రకాష్ రాజ్‌కుమార్, బాబి, వెంకటేష్, చక్రధర్‌లు, నర్సీపట్నంలో సేకరించిన గంజాయిని రైళ్ళు, ప్రత్యేక వాహనాల ధ్వార నాయుడుపేట



ఎన్ఎస్ఆర్ కాలనికి చెందిన అరవ వెంకటయ్య, నక్కబోయిన వెంకటసుబ్బయ్య, ఆత్మకూరు మీరమ్మ, పెద్దగడల వెంకటమ్మలకు చేర్చి వారి ధ్వార నాయుడుపేట పట్టణంలో అమ్మకాలు సాగిస్తున్నట్లు తెలిపారు. నాయుడుపేట సిఐ బాబి తన సిబ్బందితో కలిసి ముందస్తు సమాచారంతో గంజాయి ముఠాను పట్టుకోవడం జరిగింద న్నారు. వారిలో ప్రకాష్‌రాజ్‌కుమార్, బాబిలు పరారిలో ఉన్నట్లు తెలియజేశారు. వారిని త్వరలో పట్టుకొని అరెస్టుచేయడం జరుగుతుంద న్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నాయుడుపేట- సూళ్ళూరుపేట ప్రాంతాల్లో గంజాయిని పూర్తిగా నిర్మూలించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట సిఐ బాబి, ఎస్సైలు భవానిలక్ష్మి, శ్రీనివాసులు రెడ్డి, పోలీసులు తదితరులు ఉన్నారు

## గుంటల రోడ్ల నుంచి విముక్తి కల్పించండి



సూళ్లూరుపేట, డిసెంబర్ 9 ప్రభాతవార్త : సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలో గత రెండేళ్లుగా రోడ్లపై ఉన్న గుంటలతో అవస్థలు పడుతున్నామని, వాటి నుంచి విముక్తి కల్పించాలంటూ స్థానికంగా ఉన్న ప్రజలు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో సోమవారం మున్సిపల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని గమండ్లవీధి, హనుమాన్‌వీధి, యూనియన్ బ్యాంకు రోడ్డు, రాఘవయ్యపేట, వెంకటేశ్వరాలయ వీధిలలో కొళాయి కనెక్షన్ల పేరుతో రెండేళ్ల క్రితం రోడ్లను తవ్వేశారని, అప్పటి నుంచి ఈ గుంటల రోడ్లలో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. వర్షాకాలంలో ఈ రోడ్లపై ఉన్న గుంటలో వర్షపు నీటితో నిండిపోయి కనిపించకపోవడంతో ద్విచక్ర వాహనదారులతో పాటు పాదచారులు ఈ గుంటల్లో పడి ప్రమాదాల బారిన పడుతున్నారని, దీన్ని దృష్టిలో ఉంచుకొని తక్షణమే చర్యలు చేపట్టాలని వారు మున్సిపల్ కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు.

## తడకండ్రిగ పాఠశాలలో భోజన ప్లేట్లు వితరణ



తడ, డిసెంబర్ 9 ప్రభాతవార్త : తడ మండలం తడకండ్రిగలోని పాఠశాల విద్యార్థులకు సురేంద్ర బాబు అనే దాత సోమవారం భోజన ప్లేట్లు పంపిణీ చేశారు. సూళ్లూరుపేటకు చెందిన జి.నాగ భూషణం జ్ఞాపకార్థం ఆయన కుమారుడు సురేంద్రబాబు సుమారు 150 మంది ప్లేట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి మల్లికార్జునరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేంద్ర, ఉపాధ్యాయులు, మండల విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## అపాచి మార్గంలో రోడ్డు ప్రమాదం...ఒకరు మృతి



తడ, డిసెంబర్ 9 ప్రభాతవార్త : తడ మండలం మాంబట్టు సెజ్‌లోని అపాచి మార్గంలో సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు, దొరవారిసత్రం మండలం మేలనాలతూరు గ్రామానికి చెందిన వేలూరు తులసిరావు గత ఎనిమిదేళ్ల నుంచి అపాచి కంపెనీలో పనిచేస్తున్నాడు. ఇతను సూళ్లూరుపేటలో నివాసముంటూ సోమవారం ఉదయం కంపెనీ వద్ద పని ఉందని చెప్పి తన స్నేహితుని మోటార్‌బైక్ తీసుకొని వెళ్లినట్లు, తులసిరావు భార్య సాయిప్రసన్న పోలీసులకు తెలిపారు. అయితే అపాచి నుంచి బయలుదేరిన తులసిరావు సెజ్ మార్గంలో రోడ్డు ఎడమవైపు మార్జిన్‌లో పార్కు చేసిన కంటైనర్ వాహనాన్ని వెనుక నుంచి ఢీ కొన్నట్లు పోలీసులు తెలిపారు. అతని తల, నుదుటి మీద బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందినట్లు చెప్పారు. ఈ మేరకు తడ ఎస్ఐ కొండప్పనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సంచార జాతుల వారికి ఉచిత విద్యుత్ ఇవ్వాలి



వెంకటగిరి, డిసెంబర్ 9 ప్రభాతవార్త : సంచార జాతుల కుటుంబాలతో ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారం 100 యూనిట్లు విద్యుత్తు ఉచితంగా ఇవ్వాలని విద్యుత్తు శాఖ డి.ఈ.ఈ. ముని చంద్ర, ఏ.ఈ .అశోక్ రెడ్డిలను రాష్ట్ర కార్యదర్శి తుపాకుల వెంకటేశ్వర్లు కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యాలయము నందు కలిసి బీసీ జాబితా నందలి అత్యంత వెనుకబడిన (ఎం.బీ.సీ) సంచార కులాల కుటుంబాలకు 100 యూనిట్లు ఉచిత విద్యుత్ అందజేయ విధముగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసి ఉందని తెలిపారు.

## సొంత డబ్బులతోనే...పోలేరమ్మ ఆర్చి నిర్మాణం : ఎమ్మెల్యే



వెంకటగిరి, డిసెంబర్ 9 ప్రభాతవార్త : గ్రామ శక్తి స్వరూపణ పోలేరమ్మ ఆర్చి నిర్మాణ పను లను వీలైనంత త్వరగా పూర్తి చేయిస్తానని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరి పట్టణం క్రాస్ రోడ్ వద్ద నిర్మిస్తున్న పోలేరమ్మ ఆర్చి నిర్మాణ పనులను ఎమ్మెల్యే అధికారులతో కలిసి పరిశీలించారు. తన సొంత డబ్బులతోనే ఆర్చిని నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు. పట్టణంలోకి వచ్చే వారందరూ పోలేరమ్మ ఆర్చి ద్వారాన్ని చూసి ఇక్కడ పోలేరమ్మ ఉందని గుర్తు తెచ్చుకోవాలని తెలిపారు. ఆర్చి పనుల నిర్మాణం పూర్తయ్య వరకు ట్రాఫిక్‌ను పాలకేంద్రం మీదుగా పట్టణంలోకి మరలిస్తున్నట్లు చెప్పారు. స్థానికులందరూ ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నందువల్ల సహకరించాలని సహకరించాలని తెలిపారు. సిఐ వెంకటరమణ మాట్లాడుతూ సోమవారం నుండి ట్రాఫిక్‌ను మరలిస్తు న్నట్లు చెప్పారు. పాల కేంద్రం మీద పట్టణంలోకి వాహనాలు నడపాలని సూచిం చారు. ఆయన వెంట మాజీ ఏఎంసీ చైర్మన్ రాజేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు కోటేశ్వర్ రెడ్డి మాజీ కౌన్సిలర్లు చెంగారావు, విశ్వనాథం, తాహశీల్దార్ రాంబాబు, ఎస్ఐ సుబ్బారావు తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు



వెంకటగిరి, డిసెంబర్ 9 ప్రభాతవార్త : తోలిమిట్ట పాఠశాలలో శ్రీనివాసా సేవ ట్రస్ట్ టీవీఎస్ సంస్థల ఆధ్వర్యంలో అరవింద హాస్పిటల్ వారు విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. 52 మంది విద్యార్థులకు పరీక్షలు చేయగా ఇద్దరు విద్యార్థులలో సమస్యలు గుర్తించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అరవింద నేత్రాలయ స్క్రీనింగ్ టెస్టర్ ఎస్ శంకర్, టీవీఎస్ ప్రతినిధి సురేష్ ప్రధానోపాధ్యాయులు కె.ఉదయకుమార్, సహోపాధ్యా యులు పి.రామకృష్ణ కుమారి పాల్గొన్నారు.

## ప్రజలు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

**-మాజీ ఎంపిపి గంజి మాధవయ్య**



పుత్తూరు, డిసెంబరు 7 ప్రభాతవార్త : రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకుని ప్రజలు తమ భూ సంబంధిత సమస్యలు పరిష్కరించుకోవాలని పుత్తూరు మాజీ ఎంపిపి, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గంజి మాధవ య్య అన్నారు. సోమవారం మండ లంలోని గోపాలకృష్ణాపురం పంచా యతీలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. గతంలో భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి ప్రజలు తహశీల్దారు కార్యాలయం చుట్టూ తిరిగేవారన్నారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ప్రజల వద్దకు పాలనలో భాగంగా ప్రస్తుతం ఆయా పంచాయతీల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోం దని, తహశీల్దారుతో పాటు ఆయా ప్రాంత విఆర్ఓ, సర్వేయర్లు తదితర సిబ్బంది ఉదయం నుంచి సాయంత్రం వరకూ అందుబాటులో వుంటారని ప్రజలు ఈ సదస్సులకు హాజరై తమ సమస్యలను చక్కగా పరిష్కరించు కోవచ్చని సూచించారు. చిన్న చిన్న సమస్యలను అప్పటికపుడే పరిష్కరిస్తారని తెలిపారు. భూరికార్డుల్లో మార్పులు తదితర అంశాలకు సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన సమయంలోగా పరిష్కరిస్తారన్నారు. రెవెన్యూ సదస్సుల్లో ప్రజలు తెలిపిన సమస్యల మేరకు భవిష్యత్‌లో ప్రభుత్వం ఆయా సమస్యల పరిష్కారానికి విధానపరమైన మార్పులను కూడా తీసుకువస్తుందని, సదస్సుల ముఖ్య ఉద్దేశ్యం కూడా అదేనని తెలిపారు. సదస్సుల్లో శ్మశానాల ఏర్పాటుకు కోసం ప్రజల నుంచి వచ్చే వినతులను పరిశీలించి శ్మశానాలకు స్థలాలు కేటాయించాలని తహశీల్దారును కోరారు. సమావేశంలో తహశీల్దారు డి.సి.వెంకటేశ్వర్లు, తెలుగుదేశం పార్టీ నాయకులు ఎ.బాలాజీ, కోట గజపతి తదితరులు పాల్గొన్నారు.

## టెండర్లలో నా ప్రమేయం లేదు : ప్రతాప్‌రెడ్డి



తొట్టంబేడు, డిసెంబర్ 9 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయానికి సంబంధించిన టెండర్లతో తనకు ఎలాంటి సంబంధం లేదని కన్నలి ప్రతాప్‌రెడ్డి సోమవారం వివరణ ఇచ్చారు. వార్తదినపత్రికలో ప్రచురితమైన 'అనుబంధ ఆలయాల అభివృద్ధి ఉత్తుత్తి మాటలేనా' అనే వార్తకు స్పందించిన ఆయన వివరణ ఇచ్చారు. ఆలయంలో తాను ఎలాంటి టెండర్లు తీసుకోలేదన్నారు, అధికార దుర్వినియోగం చేయలేదన్నారు. తమ గ్రామానికి సంబంధించిన ఆగస్తీశ్వరాలయం జీర్ణోద్ధారణ పనుల్లో జరిగిన అవినీతి, అక్రమాలు, వర్షానికి లీకేజీలకు సంబంధించి తాను శాసనసభ్యులు బొజ్జల సుధీర్‌రెడ్డి దృష్టికి తెచ్చినట్లు ప్రతాప్‌రెడ్డి వివరించారు.

## జాతీయస్థాయి అవార్డు రావడం గర్వకారణం



కాణిపాకం, డిసెంబర్ 9 ప్రభాతవార్త: ఐరాల మండలం 44 బొమ్మసముద్రం గ్రామ పంచాయతీ జాతీయ స్థాయి ఉత్తమ ఆరోగ్య పంచాయతీ–2004గా ఎంపిక కావడం మనకందరికి గర్వకారణమని జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్‌రావు అన్నారు. కేంద్రప్రభుత్వం వివిధ కేటగిరిల కింద రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన నాలుగు గ్రామపంచాయతీలను ఉత్తమ గ్రామ పంచాయతీలుగా ఎంపిక చేసింది. ఈమేరకు ఉత్తమ ఆరోగ్య పంచాయతీగా బొమ్మసముద్రం గ్రామ పంచాయతీని ఎంపిక చేయడంతో గ్రామంలో డీపీఓ సుధాకర్‌రావు ఆధ్వర్యంలో సోమవారం అభినందన సభ నిర్వహించారు. ఉత్తమ పంచాయతీగా ఎంపిక కావడానికి కృషి చేసిన సర్పంచ్ రఘు, ఉపసర్పంచ్ లక్ష్మీపతి, వార్డు సభ్యులు, కార్యదర్శి, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులకు ఆయన అభినందనలు తెలిపారు. గ్రామ పంచాయతీలు అన్ని రంగాలలో అభివృద్ధి దిశగా అడుగులు వేయాలని, అందుకు కావలసిన సహాయ సహకారాలు తమ వంతు అందిస్తామని డీపీఓ సుధాకర్‌రావు తెలిపారు. పంచాయతీ సర్పంచ్, సిబ్బంది, కాణిపాకం పీహెచ్‌సీ సిబ్బందికి ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో డీఎల్‌పీఓ పార్వతి, ఈఓపీఆర్డీ కుసుమకుమారి, ఎంపీడీఓ ధనలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి మౌనిక, పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ స్వాతి సింధూర, ఎంపీటీసీ విజయ్‌కుమారి, జనసేన నాయకులు మహేష్‌స్వేరో, గ్రీన్ అంబాసిడర్‌లు, ఆశా వర్కర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## నైతిక విలువలకు నిదర్శనం శుభారాం కళాశాల




పుంగనూరు, డిసెంబరు 9 ప్రభాతవార్త : పట్టణంలోని శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విశాలమైన 14ఎకరాలలో ఏర్పడి దశాబ్దాలుగా నియోజకవర్గ విద్యా ర్థులకు నైతిక విలువలతో కూడిన విద్యనందిస్తూ నిదర్శనంగా నిలుస్తోందని, ఈ కళాశాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేస్తామని కేంద్ర యూనివర్సిటీ నాక్ కమీషన్ చైర్మన్ సంజీవ్ మిట్టల్ పేర్కొన్నారు. సోమవారం ఉదయం ఢిల్లీనుంచి కేంద్ర ప్రభుత్వ ఆదేశంతో ఆయన అధ్వర్యంలో ఇద్దరు సభ్యులతో కూడిన నాక్ కమిటీ డిగ్రీకళాశాలకు చేరుకుంది. ఈసందర్భంగా కళాశాల చైర్మన్ రాజశేఖర్, పట్టణ పెద్దలు, అలూమిని కమిటీ సభ్యులు వారికి పెద్దఎత్తున స్వాగతం పలికారు. కమిటీ కళాశాల సందర్శన అనంతరం జరిగిన సమావేశంలో సంజీవ్ మిట్టల్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్నత విద్యను బలోపేతం చేయడానికి యూనివర్సిటీలకు దోహదపడుతూ, వాటి అధ్వర్యం లోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలకు చేయూత, ఆర్థిక ప్రోత్సాహాలందిం చేందుకు కేంద్ర విద్యాశాఖ కార్యాచరణ చేస్తోందన్నారు. ఇందులో భాగంగా అలూమినీ కమిటీ విద్యార్థుల తరఫున ఆర్డర్‌పాల్, పురుషోత్తం, రామచంద్ర, చంద్ర, సిఐ జయరాం, జి.ఆర్ విజయశంకర్, జనసేన రమణ, నిరంజన్, మధు, స్వాతి కుమార్, మనోహర, విజయభాస్కరరెడ్డి, నక్కావేణులు మాట్లాడుతూ డిగ్రీ కళాశాలకు ప్రహరీ, మినీ స్టేడియం అత్యంత అసవరమని విజ్ఞప్తిచేశారు. డిగ్రీకళాశాల ఏర్పాటుకు పూర్తిస్థాయిలో సహకరించిన అప్పటి శాసనసభ్యుడు బగ్గిడిగోపాల్‌ను ప్రత్యేకంగా అలూమినీ కమిటీ సత్కరించింది. కార్యక్రమంలో నాక్ కమిటీ సభ్యులు రేవన్‌షాహీ, మహమ్మద్ అలీ, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## అనుబంధ ఆలయాల బాగోగులపై ప్రత్యేక దృష్టి

**వైకాపా దిగమింగిన నిధులు కక్కిస్తా : బొజ్జల**



శ్రీకాళహస్తి, డిసెంబర్ 9 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా గ్రామాల్లో ఉన్న చిన్న ఆలయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు. చిన్న ఆలయాల మరమ్మతుల పేరుతో గత వైకాపా పాలనలో దిగమింగిన సొమ్ములను రాబడుతామని ఆయన స్పష్టం చేసారు. సోమవారం ఆయన ప్రభాతవార్తతో మాట్లాడుతూ గత ఐదేళ్ల వైకాపా పాలనలో శ్రీకాళహస్తీశ్వరాలయ నిధులను అప్పనంగా తన అనుచరులకు దోచి పెట్టడంలో మాజీ శాసన సభ్యుడు డాక్టరేట్ సాధించారని ధ్వజమెత్తారు. శివయ్య సొత్తులను పప్పు బెల్లాలా తన అనుచరులకు పంచిపెట్టారని శివమెత్తారు. చిన్న ఆలయాల మరమ్మత్తుల పేరుతో అర్హత లేని వారికి పనులు అప్పగించి పనులు పూర్తి చేయకుండానే బిల్లులు చెల్లించిన ఘనత దక్కించుకున్నారు. తాను తన స్వగ్రామం ఊరందూరులోని ఆలయాలను, అలాగే తొట్టంబేడు మండలంలోని పెద్దకన్నలిలో ఆలయాన్ని పరిశీలించామన్నారు. రెండు గ్రామాలకు చెందిన దేశం కార్యకర్తల అభ్యర్థన మేరకు క్షేత్రస్థాయిలో ఏం జరిగిందో పరిశీలించామని తెలిపారు. ఈ నేపథ్యంలో తాను చూసిన రెండు ఆలయాల చిన్నపాటి వర్షాలకే ఆలయాలు ఉరుస్తున్నాయని తెలిపారు. నాడు ఆలయాలకు సంబంధించిన పనులు చేసిన వారిని బిల్లులు చెల్లించిన అధికారులపై తప్పక చట్టపరిధిలో చర్యలుంటాయన్నారు.

**గుడిమల్లం దత్తతకు చర్యలు:**

శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఏర్పేడు మండలంలో వెలసిన పర్యాటక ప్రసిద్ది చెందిన గుడిమల్లం ఆలయాన్ని ఎంతో కాలంగా శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా దత్తత తీసుకోమంటూ అభ్యర్థిస్తున్నారని ఈ ప్రతిపాదనను దేవాదాయశాఖ దృష్టికి తీసుకెళుతున్నామన్నారు. అక్కడ నుంచి అనుమతి వచ్చిన వెంటనే దత్తత తీసుకుంటామన్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయం పరిపాలన లో తమకు ఎవరూ ప్రతినిధుల్లేదన్నారు. ఏ అంశమైనా చట్టపరిధిలో అధికారులే పర్యవేక్షిస్తున్నట్లు ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డి వివరణ ఇచ్చారు.

# గూడూరు డివిజన్

**అనర్హుల ఏరివేత దిశగా..!**

## సామాజిక పింఛన్ల తనిఖీకి రంగం సిద్ధం

కోట, డిసెంబర్ 9 ప్రభాతవార్త : అర్హులకు అన్యాయం జగరకుండా.. అనర్హుల ఏరివేత దిశగా ప్రభుత్వం సామాజిక భద్రతా పింఛన్ల తనిఖీకి చేపట్టాలని నిర్ణయిచింది. తొలి దశలో జిల్లాలో ఏదైనా ఒక గ్రామ సచివాలయాలన్ని నమూనాగా ఎంపిక చేసుకని పరిశీలన చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎందుకంటే వైకాపా ప్రభుత్వంలో హయాంలో తప్పుడు ధృవ పత్రాలతో చాల మంది అనర్హులకు దివ్యాంగులకు ,ఇతర విభాగలల్లో పింఛన్ల మంజూరు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక,. గ్రామ సచివాలయ ఉద్యోగుల ద్వారా సొమ్ము పంపిణీ సమయంలో ఇలాంటి వారిని గుర్తించడంతో పాటు స్థానికులు నుంచి ఫిర్యాదులు అందాయి. ఈనేపద్యంలో ప్రభుత్వం పంఛన్ల తనిఖీ చేపట్టాలని నిర్ణయించింది, పింఛన్ల తనిఖీ కోసం ప్రభుత్వం ఫిజికల్ వెరిఫికేషన్ పేరిట ప్రత్యేక యాప్ ను అందుబాటులో తెచ్చింది. ఎంపిక చేసిన గ్రామంలో ఇతర మండలాలకు చెందిన ఉద్యోగులు ఇంటింటికి వెళ్లి అబ్ధిదారులు స్ధితిగతులు దివ్యాగులైతే వైక్యలం వివరాలు వితంతువులు ఒంటిరి మహిళల్లో ఎవరైనా మళ్లీ వివాహం చేసుకున్నారా ? అనే అంశాలను పరిశీలించి యాప్‌లో నమోదు చేస్తారు. వీటిపై సమగ్ర విచారణ అభ్యంతరాలు స్వీకరణ అనంతరం ఉన్నతాదికారులు తుది నిర్ణయం తీసుకుంటారు.

## గ్రీవెన్స్‌సెల్ లో ఎంపీడీవోకు వినతిలు



వాకాడు, డిసెంబర్ 9 ప్రభాతవార్త : మండల పరిషత్ కార్యాలయం లోని సోమవారం ఎంపీడీవో అన్నపూర్ణారావు ఆధ్వర్యంలో గ్రీవెన్స్‌డే కార్యక్రమం జరిగింది. మండలంలోని పలు సమస్యలపై అర్జీలు వచ్చాయన్నారు. ముఖ్యంగా ఒంటరి మహిళ పెన్షన్ కొరకు, ఇంటి నివేశ స్థలాల కొరకు, కొత్తగా గృహాలు కొరకు వచ్చాయని ఎంపీడీవో తెలిపారు. ఈ సమావేశంలో మండల పరిషత్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## ఆరోగ్యం మానసిక ఉల్లాసం కోసం ఆటల పోటీలు



వెంకటగిరి, డిసెంబర్ 9 ప్రభాతవార్త : ఆటలు పోటీలు సిబ్బంది ఆరోగ్యం ఉల్లాసం కొరకు ఎంతగానో ఉపయోగపడతాయని 9వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ అరుణ బోస్ తెలిపారు. వల్లివేడు వద్దన 9వ పోలీస్ బెటాలియన్‌లో యాన్యువల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ 2024 ఘనంగా ఓపెనింగ్ సెర్మనీ కార్యక్రమం జరిగింది. మూడు రోజులు జరిగే ఈ స్పోర్ట్స్ మీట్ లో ఈరోజు 100 మీటర్స్ రన్నింగ్, 800 మీటర్స్ రన్నింగ్, వాలీబాల్ షాట్ పుట్ లాంగ్ జంప్ టగ్గాఫ్ వార్ షటిల్ వంటి గేమ్స్ నిర్వహించడం జరిగినది. రెండవ రోజు రేపటి స్పోర్ట్స్ మీట్లో భాగంగా కబడ్డీ వాలీబాల్ ఫైనల్ క్రికెట్ జావలిన్ త్రో ఆటల పోటీలు జరుగుతాయి. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

## గర్భిణీ స్త్రీలకు భోజనాలు పంపిణీ



గూడూరు, డిసెంబర్ 9 ప్రభాతవార్త : గూడూరు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చంటి జ్ఞాపకార్థం మనపాటి శ్రీనివాసరావు దాతృత్వంలో గూడూ రు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నందు నిరుపేద గర్భిణీ స్త్రీలకు భోజనాలను ముఖ్య అతిథి డాక్టర్ షరీనా చేతుల మీదుగా అందజేయడం జరిగినది. అదే విధంగా జనవిజ్ఞాన వేదిక వారు మా ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే నిరుపేద గర్భిణీ స్త్రీలకి 11 సంవత్సరాలుగా నిరంతరాయంగా భోజనాలు అందించడం ఈ రాష్ట్ర చరిత్రలోనే గూడూరు జేవివి గూడూరు వారికే సాధ్యమని తెలిపారు. జేవివి వారికి మా సహకారం తప్పనిసరిగా అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమం లో జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్, నాగరాజు, చెంచునారాయణ, ప్రభాకర్, ఆనంద్, సుబ్బారావు, మస్తాన్, జగదీష్, పవన్, సాయి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకం ద్వారా అభివృద్ధి పనులు



గూడూరు, డిసెంబర్ 9 ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు గూడూరు శాసనసభ్యులు పాశం సునీల్‌కుమార్ సూచనలు మేరకు పెద్దలు ప్రముఖ పారిశ్రామికవేత్త, పెంచల కోన మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ తానంకి నానాజీ ఆదేశాల మేరకు మండల పార్టీ అధ్యక్షులు ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి ఆధ్వర్యంలో చిల్లకూరు మండలం తొణుకు మాల గ్రామ పంచాయతీలో గ్రామల అభివృద్ధి పనులు, కొత్త జాబ్ కార్డు, చనిపోయిన పేర్లు తొలగించుట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మండల బీసీ సెల్ అధ్యక్షులు మేకల కుమార్, గ్రామ సర్పంచ్ బొమ్మిళ్ల త్రివిక్రమ్, గ్రామ ఉప సర్పంచ్ అరిపినేటి విజయ భాస్కర్, గ్రామ పార్టీ అధ్యక్షులు రాగి చంద్రయ్య, మదనం బేటి భీమాచారి, గ్రామ కార్యదర్శి కావాలి వెంకటరమయ్య, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు వినయ్ మొగిలి గుంట, పంచాయతీ సెక్రటరీ నాగూర్ బాబు, ఏపిఓ గిరిబాబు, జేఈ చలపతి, టిఏ భార్గవి, ఎఫ్ఎ వాసు, మోళి, పురేంద్ర, సుబ్బరాయుడు, గిరి, పాండు, శ్రీనివాసులు, తదితరులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## అక్రమ సస్పెన్షన్లను రద్దుచేసి విధులలోకి తీసుకోవాలి

**-ఎస్‌డబ్ల్యూఎఫ్ తిరుపతి రీజనల్ నాయకులు రామకృష్ణ**

గూడూరు, డిసెంబర్ 9 ప్రభాతవార్త : ఏ.పి.ఎస్.ఆర్టీసి గూడూరు డిపో ఎదుట సోమవారం రోజు కండక్టర్, డ్రైవర్ల, అక్రమ సస్పెన్షన్ రద్దు చేయాలని ఎస్‌డబ్ల్యూఎఫ్,(సి.ఐ.టి.యు) అనుబంధం ఆధ్వర్యంలో జరుగుతున్న నిరసన కార్యక్రమం సోమవారానికి 5వ రోజుకు చేరుకుంది. ఈ కార్యక్రమానికి డిపో సహాయ ప్రచార కార్యదర్శి కత్తి సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ తిరుపతి రీజినల్ నాయకులు రామకృష్ణ (ఆర్‌కె) మాట్లాడుతూ ఇప్పటికైనా డిపో మేనేజర్ స్పందించి అక్రమ సస్పెన్షన్లను రద్దుచేసి ఉద్యోగులను విధులలోకి తీసుకోవాలని కోరారు. రిలే నిరాహార దీక్షలు, వంట వార్పు కార్యక్రమాలను దీక్ష శిబిరంలోనే నిర్వహించడం జరుగు తాయని తెలియచేసారు. ఈ కార్యక్రమానికి వెంకటగిరి డిపో కమిటీ పూర్తి మద్దతును తెలియజేస్తూ ఎంఎస్. నారాయణ, పాండురంగయ్య ఎస్‌డబ్ల్యూ ఎఫ్ సీనియర్ నాయకులు ఎం. శేషయ్య, సిహెచ్ రాము, జిఎం రమణయ్య, ఏ.శీనయ్య, భాస్కర్, పి.రవీంద్ర గ్యారేజీ సిబ్బంది సిఐటియు గూడూరు పట్టణ కమిటీ నాయకులు యస్.సురేష్, ప్రసాద్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరు-చెన్నై హైవేని విస్తరించండి

**-పార్లమెంటులో ప్రస్తావించిన తిరుపతి ఎంపీ గురుమూర్తి**



గూడూరు, డిసెంబర్ 9 ప్రభాతవార్త : కలకత్తా – చెన్నై జాతీయ రహదారి 16 నెల్లూరు నుంచి చెన్నై వరకు రహదారిని 4 లేన్ నుంచి 6 లేన్‌గా మార్పు చేయాలని ప్రత్యేక అధికరణ 377 ద్వారా తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి పార్లమెంటులో ప్రస్తావించారు. ఇందులో బాగంగా ముఖ్యంగా కృష్ణపట్నం ఓడరేవు, శ్రీ సిటీ, మేనకూరు వంటి పారిశ్రామిక ప్రాంతాలుండడంతో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉందని ఎంపీ గుర్తు చేశారు. పారిశ్రామిక రవాణా వృద్ధి కారణంగా భారీగా సరుకులు తరలించడంతో పాటు 4లేన్ రహదారి పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీకి సరిపోవడం లేదని సభ దృష్టికి ఆయన తీసుకెళ్లారు. దీంతో ట్రాఫిక్ రద్దీ, రోడ్డు ప్రమాదాలు, ప్రయాణ సమయం పెరిగాయని వివరించారు. హైవే విస్తరణ చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా వుందని ఎంపీ పేర్కొన్నారు.

## రాష్ట్ర క్రికెట్ జట్టుకి లీలా వికాస్ ఎంపిక



గూడూరు, డిసెంబర్ 9 ప్రభాతవార్త : గూడూరులోని అల్లూరి ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియం లోని ఎసిఎ సబ్ సెంటర్ నందు శిక్షణ తీసుకుంటున్న లీలా వికాస్ అను క్రీడాకారుడు ఆంధ్ర రాష్ట్ర అండర్ 14 జట్టు ప్రాబబుల్‌గా ఎంపిక అయ్యారు. నెల్లూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ కొణిదల ముని గిరీష్ మాట్లాడుతూ గూడూరులోని ఈ ఏసీఏ సబ్ సెంటర్ నుండి ఇప్పటివరకు ఆరుగురు క్రీడాకారులు రాష్ట్ర జట్టుకు ఎంపిక కావడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ నెలలో విజయనగరంలో జరిగే ప్రాబబుల్స్ మ్యాచులలో ప్రతిభ కనబరిస్తే తప్పకుండా రాష్ట్ర జట్టులో మంచి ఆల్‌రౌండర్‌గా అవకాశం దక్కుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏసీఏ కోచ్ లవ కుమార్ మాట్లాడుతూ కడపలో జరిగిన సౌత్ జోన్ పోటీలలో లీలా వికాస్ అను క్రీడాకారుడు బౌలింగ్ బ్యాటింగ్ రెండు విభాగాలలో అద్భుతంగా రాణించి రాష్ట్ర జట్టులో స్థానం సంపాదించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ క్రికెట్ క్రీడాకారులు నూర్ మొహమ్మద్, మధు సుబ్రహ్మణ్యం, రజిని, విజయ, సంతానం, మహేష్, వెంకీ తదితర క్రీడాకారులు పాల్గొన్నారు.